


EVENING EDITION

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

ఆదివారం

26-01-2025

పేజీలు: 02

26 January RepublicDay


# కర్తవ్యపథ్‌లో ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు

## జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో 76 గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం (జనవరి 26) జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసారి రిపబ్లిక్ వేడుకలకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము, ఇండోనేషియా ప్రెసిడెంట్ సుబియాంటో ఇరువురూ 'సాంప్రదాయ బగ్గీ'లో రావడం విశేషం. ఈ పద్ధతి 40 సంవత్సరాల తర్వాత 2024లో తిరిగి అనుసరించారు. వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు. కర్తవ్య పథంలో జరిగిన కవాతును దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత వాయిద్యాలతో కూడిన 300 మంది సాంస్కృతిక కళాకారుల బృందం 'సారే జహాన్ సే అచ్ఛా' వాయించారు. ఇక నేటి రిపబ్లిక్ వేడుకల్లో బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్తవ్య పథ్‌పై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర రిపబ్లిక్ డే పరేడ్ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 31 శకటాలను ఇందులో ప్రదర్శించారు. వేడుకల్లో మొట్టమొదటిసారిగా, ట్రై-సర్వీసెస్ టేబుల్‌లో సాయుధ బలగాల మధ్య ఉమ్మడి, ఏకీకరణ స్ఫూర్తిని చూపేలా 'శశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' థీమ్‌తో త్రివిధ దళాల మధ్య నెట్‌వర్కింగ్, కమ్యూనికేషన్‌ను సులభతరం చేసే జాయింట్ ఆపరేషన్స్ రూమ్‌ను ప్రదర్శించనున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 29న విజయ్ చౌక్‌లో జరిగే ' బీటింగ్ రిట్రీట్ సెర్మనీ'తో గణతంత్ర దినోత్సవ వేడుకలు ముగుస్తాయి. ఈ ఏడాది కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించనున్నారు.



తెలుగు రాష్ట్రాల్లో ఎలా జరిగాయంటే..

* సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. గవర్నర్ జిష్ణుదేవ్ జాతీయజెండాను ఆవిష్కరించారు. వేడుకలకు హాజరైన సీఎం రేవంత్ అమరులు స్తూపం దగ్గర నివాళులర్పించి రాజ్యాంగం గొప్పదనాన్ని చాటారు.
* విజయవాడ మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ సైనికుల గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించారు. వేడుకలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ హాజరయ్యారు
* గణతంత్ర వేడుకల సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి జూబిలీహిల్స్‌లోని తన నివాసంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు కలిసికట్టుగా సాగుదామని పిలుపునిచ్చారు.
* తెలంగాణ అసెంబ్లీలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పోలీసులు గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
* గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసన మండలి ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరించారు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఆయన వెంట పలువురు ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు ఉన్నారు.
* ఏపీ సచివాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. చీఫ్ సెక్రటరీ విజయానంద్ సైనికుల గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
* గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖలో జాతీయ జెండాను ఆవిష్కరించారు ఏపీ హోంమంత్రి అనిత. తన క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం దగ్గర పూలు చల్లి నివాళులర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.
* తెలంగాణ మంత్రి సీతక్క ములుగులోని తన క్యాంపు ఆఫీసులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసులు గౌరవ వందనం స్వీకరించి రాజ్యాంగం గొప్పదనాన్ని చాటిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.
* తూర్పుగోదావరి జిల్లా కడియం పల్ల వెంకన్న నర్సరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఘనంగా గణతంత్ర వేడుకలు

దేశవ్యాప్తంగా 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఢిల్లీలోని BJP కేంద్ర కార్యాలయంలో జాతీయాధ్యక్షుడు JP నడ్డా, బెంగళూరులోని INC పార్టీ కార్యాలయం వద్ద AICC అధ్యక్షుడు ఖర్గే త్రివర్ణ పతాకాలు ఆవిష్కరించారు. ముంబైలో MH గవర్నర్ రాధాకృష్ణన్, చెన్నైలో TN గవర్నర్ రవి, భువనేశ్వర్‌లో ఒడిశా గవర్నర్ హరిబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వేడుకలు జరిగాయి.

## ఇది కర్షక ప్రభుత్వం: గవర్నర్ జిష్ణుదేవ్

ప్రజా ప్రభుత్వం కర్షకులకు రైతు భరోసా అందిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 'వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వనున్నాం. సన్నరకం బియ్యానికి బోనస్ అందించాం.2024 వానాకాలంలో 1.59 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి చేశాం. 50 లక్షల పేద కుటుంబాలకు గృహజ్యోతి అందిస్తున్నాం. యువత సాధికారత కోసం యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం' అని గణతంత్ర దినోత్సవం ప్రసంగంలో వివరించారు.



## ప్రముఖ కార్డియాక్ సర్జన్ KM.చెరియన్ కన్నుమూత

ప్రముఖ కార్డియాక్ సర్జన్ KM.చెరియన్(82) కన్నుమూశారు. నిన్న బెంగళూరులో ఓ వివాహ వేడుకకు హాజరైన ఆయన సాయంత్రం ఉన్నట్టుండి కుప్పకూలారని, ఆస్పత్రిలో చేర్పించగా అర్ధరాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భారత్‌లో తొలి కరోనరీ ఆర్టరీ బైపాస్ శస్త్రచికిత్స, తొలి గుండె-ఊపిరితిత్తుల మార్పిడి సర్జరీ చేసిన వైద్యుడిగా ఆయన పేరొందారు. పద్మశ్రీ, హార్వర్డ్ మెడికల్ ఎక్సలెన్స్ వంటి అవార్డులు అందుకున్నారు.



## తెలంగాణలో నాలుగు పథకాలకు శ్రీకారం

తెలంగాణలో ఇప్పటికే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు, గృహలక్ష్మి, 500రూపాయలకు గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టింది. వీటిలో మొదటిది కొత్త రేషన్ కార్డుల పథకం. తెలంగాణ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులకు మోక్షం లభించింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నారు. రెండో పథకం రైతు భరోసా. సాగుకు అనుకూలమైన భూములకు ఒక్కో ఎకరానికి 12 వేల రూపాయలు అందిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. సాగుకు యోగ్యంకాని భూములకు రైతుభరోసా వర్తించదు. అర్హులైన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బు జమచేయనుంది. మూడో పథకం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా. రాష్ట్రంలో భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రెండు విడతల్లో 12 వేల రూపాయల ఆర్థికసాయాన్ని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అందించనుంది రేవంత్ ప్రభుత్వం. ఒక్క గుంట కూడా భూమి లేని నిరుపేదలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ఇక నాలుగో పథకం ఇందిరమ్మ ఇల్లు. ఇంటి స్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకోవడానికి.. ఇంటి స్థలం లేనిపేదలకు ఇల్లు అందించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చిన తెలంగాణ సర్కార్. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 80 లక్షల 54 వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ నాలుగు పథకాలను తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని చంద్రవంచ గ్రామంలో లాంఛనంగా ప్రారంభిస్తారు సీఎం రేవంత్ రెడ్డి. ఇప్పటికే పథకాల అమలు కోసం ఒక్కో పథకానికి ఒక్కో అధికారి చొప్పన నియమించింది ప్రభుత్వం. గ్రామానికి నలుగురు మండల స్థాయి అధికారులను అపాయింట్ చేసింది. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని తెలిపింది ప్రభుత్వం. మార్చి 31లోగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని లబ్ధిదారులకు పథకాలు వర్తించేలా ప్రణాళికలు రూపొందించామంది. అసలైన లబ్దిదారులకు అన్యాయం జరగొద్దని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి. అనర్హులకు పథకాలు వర్తింపజేస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

## ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుంది: ప్రధాని మోదీ

దేశ ప్రజలందరికీ ప్రధాని మోదీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు మనం మన అద్భుతమైన గణతంత్ర వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా మన అభివృద్ధి ప్రయాణం ప్రజాస్వామ్యం, గౌరవంతోపాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా మార్గాన్ని రూపొందించిన మహనీయులందరికీ నివాళులర్పిస్తున్నా. ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుందని, బలమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నా అంటూ ఎక్స్ వేదిగా పోస్ట్ చేశారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో



ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాయకత్వంలో న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో రిపబ్లిక్ డే కార్యక్రమం ప్రారంభమైంది.


## వీర జవాన్లకు సీఎం రేవంత్ నివాళి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని వీర జవాన్ల స్తూపానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామంలో సైనికుల త్యాగాలను ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం సీఎం అక్కడే జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొంటారు.




## అగ్గి రాజేసేలా అఖండ బ్యూటీ

పదేళ్ల క్రితం టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ప్రగ్యా జైస్వాల్ ఆశించిన స్థాయి స్టార్‌డం దక్కించుకోలేక పోయింది. మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయినా కంచె సినిమాతోనే ఎక్కువ మంది ఈ అమ్మడిని గుర్తు పట్టడం మొదలు పెట్టారు. వరుణ్ తేజ్‌కి జోడీగా నటించి మెప్పించిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన అందంతో ఆకట్టుకుంది. ఇక బాలయ్య మూవీలు అఖండ, డాకూ మహారాజ్ మూవీలతో అందరికి దగ్గరైంది.. అలాగే సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా హీరోయిన్‌గా కంటే ఎక్కువగా సోషల్ మీడియా ద్వారానే పాపులారిటీని ఈ అమ్మడు సొంతం చేసుకుంది. ఇన్‌స్టాలో ఈ అమ్మడికి దాదాపుగా మూడు మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. తన సోషల్ మీడియా ఫాలోవర్స్ కోసం రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేసే ప్రగ్యా జైస్వాల్ తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి నడుము చేసిన ముద్దుగుమ్మ అంతకు మించి అన్నట్లుగా తన అందంతో ఆకట్టుకుంది.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




మరో సంచలన సినిమాతో 'ది కశ్మీర్ ఫైల్స్' దర్శకుడు..

## 'ది ఢిల్లీ ఫైల్స్' టీజర్ రిలీజ్

'ది కశ్మీర్ ఫైల్స్' సినిమాతో వివాదాస్పద దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. కశ్మీర్ పండిట్‌ల నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం ప్రశంసలతో పాటు బీజేపీ ప్రాపగండా మూవీ అంటూ విమర్శలు అందుకుంది. అయితే ఈ సినిమా అనంతరం వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ది దిల్లీ ఫైల్స్'. 'ది బెంగాల్ ఛాప్టర్' అనేది ఉపశీర్షిక. ఈ సినిమాను 'ది కశ్మీర్ ఫైల్స్' నిర్మించిన టాలీవుడ్ బ్యానర్ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఆగష్టు 15న ఇండిపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నేడు టీజర్‌ను విడుదల చేసింది. బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి రాజ్యాంగంలోని భారత రాజ్యాంగ ప్రవేశికను చదువుతూ నడుస్తున్నట్లు ఈ వీడియోను కట్ చేశారు మేకర్స్. కాగా ఈ వీడియోను మీరు కూడా చూసేయండి. మరోవైపు ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయబోతున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇదిలావుంటే ఈ సినిమాపై నెటిజన్లు ప్రాపగండా మూవీ అంటూ కామెంట్లు పెడుతున్నారు. బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఎలక్షన్ ప్లాన్ అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



తండ్రిని తలచుకొని భావోద్వేగానికి గురైన

## అజిత్ కుమార్

ప్రముఖ సినీ నటుడు అజిత్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ.. ఈ రోజు ఆయన ఉండి ఉంటే ఎంతో గర్వపడేవారంటూ ఎమోషనల్ అయ్యారు. రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిన విషయం విధితమే. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పద్మ అవార్డులకు ఎంపిక చేసింది. ఈ ఏడాది ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, మరో 13 మందికి పద్మశ్రీని ప్రకటించింది. తమిళ నటుడు ఎస్ అజిత్ కుమార్‌కు పద్మభూషణ్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికవడంపై అజిత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైన తల.. సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ఇంతటి గౌరవం దక్కడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సమయంలో తన తండ్రి ప్రాణాలతో ఉంటే బాగుండేదని అనిపిస్తోందన్నారు. ఈ సమయంలో తనను చూసి ఆయన ఎంతో గర్వపడే వారంటూ ఎమోషనల్ అయ్యారు.

జాతీయ జెండా ఆవిష్కరించిన

## తెలుగు రాష్ట్రాల గవర్నర్లు

తెలుగు రాష్ట్రాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఏపీలో విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, Dy.CM పవన్, మంత్రి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో TG గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జెండాను ఎగురవేశారు. సీఎం రేవంత్, భట్టి విక్రమార్క సహా మంత్రులు పాల్గొన్నారు.





వన్ నేషన్- వన్ ఎలక్షన్‌పై

## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కీలక వ్యాఖ్యలు

వన్ నేషన్- వన్ ఎలక్షన్.. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం జమిలి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.. జమిలి ఎన్నికల బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ కూడా ఏర్పాటైంది.. జమిలి ఎన్నికల బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షం వాదిస్తుండగా.. జమిలితో ఎన్నో ప్రయోజనాలున్నాయని కేంద్రం చెబుతోంది.. ఈ తరుణంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక వల్ల భారత్‌కు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఇది సుపరిపాలనకు కొత్త నిర్వచనాన్ని ఇస్తుందన్నారు. పాలనలో సుస్థిరతతోపాటు విధానాల్లో అనిశ్చితిని తొలగించడానికి, వనరులు పక్కదోవ పట్టడాన్ని తగ్గించడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారాలను తగ్గించడానికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ దోహదపడుతుందన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. గత 75 ఏళ్లలో దేశం సాధించిన పురోగతిని ముర్ము ప్రస్తావించారు. సుసంపన్న, సమ్మిళిత భారత్ సాకారానికి పౌరులందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ నేడు ప్రపంచ ఆర్థిక ధోరణులను ప్రభావితం చేస్తుందని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రపంచంలోనే కీలక ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని.. వివరించారు.. సరిహద్దులను కాపాడుతున్న సైనికుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఇటీవల భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అంతరిక్ష రంగంలో పెద్ద ఎత్తున దూసుకుపోతోందని అన్నారు. వాతావరణ మార్పులు.. ప్రపంచ ముప్పును ఎదుర్కొనేందుకు కృషి చేయాలని రాష్ట్రపతి పౌరులకు పిలుపునిచ్చారు.

వారికి సదా

## రుణపడి ఉంటాను..

### పద్మ భూషణ్ అవార్డ్ పై స్పందించిన బాలకృష్ణ..



పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. తనకు శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ థ్యాంక్స్ చెప్పారు. సుదీర్ఘ ప్రయాణంలో తనతో పాటు పాలు పంచుకున్న నటించిన నటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు, కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు బాలకృష్ణ. అభిమానులు, ఆధారాభిమానం చూపిస్తున్న ప్రేక్షక లోకానికి రుణపడి ఉంటానన్నారు బాలకృష్ణ. ఈ సందర్భంగా తోటి పద్మ అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారాయన. 50 ఏళ్లుగా సినీ రంగంలో సేవలు బాలకృష్ణ సేవలకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటి వరకు 109 చిత్రాల్లో నటించిన బాలకృష్ణ.. హిందూపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు బాలకృష్ణ.

"కృతజ్ఞతాభివందనాలు, నాకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా, ఈ అవార్డు ప్రకటించిన భారత ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్న అందరికీ నా ధన్యవాదాలు. నా ఈ సుధీర్ఘ ప్రయాణంలో పాలుపంచుకున్న తోటి నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, నిర్మాతలకు, పంపిణీదారులకు, ఎగ్జిబిటర్లకు, కుటుంబ సభ్యులకు మరియు యావత్ చలనచిత్ర రంగానికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా తండ్రిగారైన స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి నుండి ఆయన వారసుడిగా నేటి వరకు నా వెన్నంటి ఉండి నన్ను ప్రోత్సహిస్తున్న నా అభిమానులకు, నాపై తమ విశేష ఆధారాభిమానాలు కురిపిస్తున్న అశేష ప్రేక్షక లోకానికి సదా రుణపడి ఉండగలనని తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా నాతోటి పద్మ అవార్డు గ్రహీతలందరికీ కూడా నా అభినందనలు అందిస్తున్నాను. అప్పుడు-- ఇప్పుడు-- ఎల్లప్పుడూ-- సదా మీ నందమూరి బాలకృష్ణ" అంటూ ట్వీట్ చేశారు.


వరంగల్ జిల్లాలో

## ఘోర రోడ్డు ప్రమాదం..

### ఆటోలపై దూసుకెళ్లిన లారీ ఏడుగురు మృతి




వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అదుపుతప్పిన ఓ లారి ఆటోలపై దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన మామునూర్ హైవేపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇనుప స్తంభాల లోడుతో వెళ్తున్న లారీ అదుపు రోడ్డు పక్కనే ఉన్న ఆటోలపై పడింది. ఈ ప్రమాదంలో చిన్నారితో సహా ఏడుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు ఇనుప స్తంభాల కింద ఇరుక్కోవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




మనదే ఇదంతా.. రవితేజ

## 'మాస్ జాతర' గ్లింప్స్ రిలీజ్

మాస్ మహరాజా రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ట్యాగ్‌లైన్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా కనిపించనున్న ఈ చిత్రం మే 9న థియేటర్‌లలో సందడి చేయనుంది. నేడు రవితేజ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు చిత్రబృందం శుభాకాంక్షలు తెలుపుతూ.. 'మాస్ జాతర' అంటూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంది ఈ గ్లింప్స్. చాలా రోజుల తర్వాత పాత రవితేజ కనిపించబోతున్నాడని.. రవితేజ అభిమానులు కోరుకునే అన్ని అంశాలుంటాయని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.




విజయ్ చివరి సినిమా..

## 'దళపతి 69' టైటిల్, ఫస్ట్ లుక్ రిలీజ్

ఇటీవల రాజకీయల్లోకి ఎంట్రీ ఇచ్చిన తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ తన చివరి చిత్రం దళపతి69లో నటిస్తున్న విషయం తెలిసిందే. అందరూ గోట్ సినిమానే విజయ్‌కు చివరి చిత్రం అనుకున్నారు. అయితే గోట్ కాకుండా అభిమానుల కోసం మరో సినిమాను ప్రకటించాడు విజయ్. తన చివరి చిత్రం ప్రజ సమస్యలపై ఉండబోతున్నట్లు ప్రకటించాడు. దళపతి 69 గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను కార్తీ (ఖాకీ) సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహించబోతున్నాడు. అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మించనుంది. ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తిచేసుకుంటున్న ఈ చిత్రం నుంచి రిపబ్లిక్ డే కానుకగా ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేశారు మేకర్స్. ఈ సినిమాకు 'జన నాయగన్'(ప్రజల నాయకుడు) అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఇక ఫస్ట్ లుక్ చూస్తే.. బ్యాక్‌గ్రౌండ్‌లో యువతతో సెల్ఫీ దిగుతున్నట్లు ఫస్ట్ లుక్ ఉంది.